శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## నేటి నుంచి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ప్రారంభం



**నెల్లూరు అక్టోబర్ 20, ప్రభాతవార్త-వైద్యం** జిల్లావ్యాప్తంగా ఉన్న 497 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఉన్న ప్రాంతాల్లో నేటి నుండి ఫ్యామిలీ కాన్సెప్ట (రోగి వద్దకే డాక్టర్) అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యాధికారి ఎం.పెంచలయ్య వెల్లడించారు. గురువారం సంతపేటలోని ఆ కార్యాలయంలో డీఎంహెచ్ఓ విలేఖరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో వైద్యాధికారి, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, ఆశాలు, ఆరోగ్య సంచార సిబ్బంది ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ప్రజలకు వైద్యాన్ని అందించేందుకు అందుబాటులో ఉంటారన్నారు. ప్రతి పిహెచ్‌సీ, యుపిహెచ్‌సీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం అంగన్వాడి కేంద్రాల్లోను, పాఠశాలల్లో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా ఇస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కదలలేని వారు ఆరోగ్యశ్రీ లబ్దిదారులను పరామర్శించి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో సాధారణ రుగ్మతలకు వైద్యం, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కౌమార దశలోని బాలబాలికలు, వృద్ధులు, దీర్ఘకాలిక సమస్యలైన అధిక రక్తపోటు, మధుమేహం, క్షయ మొదలైన వ్యాధులతోపాటు పౌష్టికాహార, మానసిక ఆరోగ్య సేవలు, పొగాకు, మద్యం నివారణకు కౌన్సిలింగ్ సేవలు కూడా అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో 67రకాల మందులు, 14రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని పెంచలయ్య పేర్కొన్నారు. ప్రత్యేక నిపుణులైన టెలీ మెడిసిన్ సేవలతోపాటు అవసరమైన రోగులకు రిఫరల్ సేవలు అందుబాటులో ఉంటాయని, కుటుంబ వైద్యుల అందరి మొబైల్ నంబర్లు విలేజ్ క్లినిక్‌లో ప్రదర్శిస్తారన్నారు. ఈ విధంగా నిర్ధేశించిన రోజుల్లో గ్రామాల్లో గల ప్రతి కుటుంబానికి మెరుగైన వైద్య, ఆరోగ్య సేవలు వారి గ్రామంలోనే అందించబడతాయన్నారు.

## శిక్షణా తరగతులను పరిశీలించిన ఏ.ఎమ్.ఓ



**కొడవలూరు అక్టోబర్ 20 ప్రభాతవార్త:** శిక్షణా తరగతులు ఉద్దేశంచి 3,4,5 తరగతుల బోధించే ప్రథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ' టీచింగ్ ఎట్ రైట్ లెవల్ ' శిక్షణ కార్యక్రమంను కొడవలూరు మండల, నార్త్‌రాజుపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గురువారం శిక్షణా తరగతులను పి ఎం ఆర్ సి ఐ టి డి ఎ (యానాదీస్ ) ఏ.ఎం.ఓ శాంతికుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3,4,5 తరగతులలో తెలుగు, గణితంలో వెనుకబడిన విద్యార్థులకు ఈ శిక్షణా కార్యక్రమం చాలా గొప్పగా ఉపయోగపడుతుందన్నారు. ఈ శిక్షణా కార్యక్రమం అనంతరం పాఠశాలలో కార్యక్రమాన్ని అమలు చేయవలసి ఉమటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారిణి వసంత కుమారి, రిసోర్స్ పర్సన్స్ రామచంద్రయ్య, వెంకటకృష్ణారెడ్డి, హరిబాబు, సిఆర్పిలు పాల్గొన్నారు.

## సంగం సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంబించిన డిఎస్‌పి



**సంగం అక్టోబర్ 20 ప్రభాతవార్త** సంగంలో నూతన సర్కిల్ ఇనస్పెక్టర్ కార్యాలయాన్ని ఆత్మకూరు డిఎస్‌పి వెంకటేశ్వరరావు ప్రారంబించారు. నూతన కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగం సర్కిల్ మొట్టమొదటి సిఐగా రవినాయక్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ నాగార్జునరెడ్డి, చేజర్ల ఎస్ఐ మరిది నాయుడు, ఎఎస్‌పేట ఎస్ఐ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

## నూతన భవనాలు ప్రారంభం




**అనంతసాగరం, అక్టోబర్20, ప్రభాతవార్త:** గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అనంతసాగరం మండలం బొమ్మవరం గ్రామంలోని అగ్రహారంలో నూతన సచివాలయం, రైతు భరోసాకేంద్ర భవనాలను ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. తొలుత అనంతసాగరం మండల వైసిపి బూత్ కన్వీనర్ అక్కలరెడ్డి అంకిరెడ్డి శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డికి పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గడపగడపకు మన ప్రభుత్వం రివ్యూ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు రెండు లక్షల కోట్లు ఖర్చుచేశారన్నారు. గురువారం వాలంటీర్లు, మండల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ఇంటింటికి వెళ్ళి సమస్యలు అడిగి తెలుసుకున్నాన్నారు.

గ్రామంలో సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని మండల అధికారులను ఆయన ఆదేశించారు. మండలంలో మొదటిగా బొమ్మవరం సచివాలయాన్ని , రైతుభరోసా కేంద్రాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మండలంలో పూర్తికాని సిచవాలయాల పనులను పూర్తిచేసి త్వరితగతిన ప్రారంభించాలన్నారు. ఈకార్యక్రమంలో అనంతసాగరం జడ్పీటిసి సభ్యులు రాపూరు వెంకటసుబ్బారెడ్డి, మండలాధ్యక్షురాలు పెయ్యల సంపూర్ణమ్మ, సర్పంచ్ కె.లక్ష్మీదేవి, ఎంపిడిఒ ఎ.మధుసూధనరావ్, తహసిల్దార్ నర్సింహం, డిప్యూటీ తహసిల్దార్ టి.ప్రదీప్, ఎంపిటిసి సభ్యులు ఎ.కొండారెడ్డి, వైసిపి నాయకులు ఎ.నారాయణరెడ్డి, ఎ.భాస్కర్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళపై హత్యాయత్నం



**కొడవలూరు అక్టోబర్ 20 ప్రభాతవార్త:** కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం డిసియల్ ఫ్యాక్టరీ వద్ద ఆటోలో మానేగుంట పాడు గ్రామానికి వెళుతున్న చెంచులక్ష్మి అనే యువతిని, కోవూరు మండలం లేగుంటపాడు గ్రామానికి చెందిన స్వర్ణా సురేష్ అనే వ్యక్తి బైక్ పై వచ్చి, ఆటోను అడ్డుకుని, యువతిని ఆటోలో నుండా బైటకు లాగి నడిరోడ్డుపై విచక్షణ రహితంగా కత్తితో హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన రక్తం మడుగులో కొట్టుకుంటున్న చెంచులక్ష్మిని స్థానికుల సమాచారం మేరకు ఎస్సై సుబ్బారావు ఘటనాస్థలానికి చేరుకొని, స్థానికుల సహకారంతో హుటాహుటిన నెల్లూరు వైద్యశాలకు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయమే లక్ష్యం

**నెల్లూరురూరల్, అక్టోబరు20 ప్రభాతవార్త** పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాల అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి తెలిపారు. గురువారం రూరల్ పరిధిలోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్లో రాజ్యసభసభ్యులు, జిల్లా వైకాపా పార్టీ అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్ధి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చందశేఖర్‌రెడ్డిల పరిచయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పట్టభద్రుల, ఉపాధ్యాయులను గుర్తించి ఓటర్ల నమోదును వేగవంతం చేయాలన్నారు. ఓటర్లకు




అవగాహన కోసం జిల్లావ్యాప్తంగా కార్యాలయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రెండు స్థానాల్లో విజయం సాధించేలా ప్రణాళికాబద్దంగా కృషి చేయాలన్నారు.

ఎంపి ఆదాల ప్రభాకరరెడ్డి, మాజీమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, మానుగుంట మహీధర్‌రెడ్డి, కమ్యూనిటి డవలప్‌మెంట్ చైర్మెన్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్లి కళ్యాణచక్రవర్తి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లాలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు

**నెల్లూరురూరల్, అక్టోబరు20 ప్రభాతవార్త** జిల్లాలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేస్తున్నామని నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డి తెలిపారు. గురువారం మాజీమంత్రి, సిటి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌తో కలసి రూ.3.96కోట్ల అంచనాలతో నిర్మించిన కృష్ణపట్నం కాలువ పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో రూ.400కోట్లతో వివిధ పారుదల కాలువల పనులు జరుగుతున్నాయన్నారు. రూ.3వేల కోట్లతో రామాయపట్నం పోర్టు పనులు, రూ.500కోట్లతో



ఫిషింగ్ హార్బర్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రూ.100కోట్లతో నెల్లూరు రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులు జరుగుతున్నా యన్నారు. జాతీయ రహదారిపై మూడు వంతెనలు మంజూరయ్యాయని, తద్వారా ప్రమదాలు తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయని వివరించారు. నగరంలో మంచి నీటి, డ్రెయినేజీ పథకం పనులు పూర్తికాకపోయినా రూ.వెయ్యి కోట్ల భారం కార్పోరేషన్‌పై పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో విజయడెయిరీ చైర్మెన్ కొం డ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటి మేయర్ ఖలీల్‌అహ్మద్ తదితర కార్పోరేటర్లు, అధికారులు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### విధి నిర్వహణలో మృతి చెందిన పోలీసు
## కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటా



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబరు 20, ప్రభాతవార్త:** పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మృతుల కుటుంబాలకు రావాల్సిన అన్ని బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా కృషి చేస్తు న్నామని జిల్లా ఎస్పీ విజయ రావు గురువారం పోలీసు అమరవీరుల సంస్మ రణ దినోత్సవం సందర్భంగా పేర్కొన్నారు. శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో కారుణ్య నియామకాల ద్వారా అర్హత కలిగిన 6 పోలీసు కుటుంబాలకు పోస్టింగ్ కల్పించామన్నారు. అంతే కాకుండా రోడ్డు ప్రమాదంలో మృతి చెం దిన పలువురు పోలీసు కుటుంబాలకు రూ.30 లక్షల చొప్పున ప్రమాద బీమా అందేలా చొరవ చూపామని తెలిపారు. సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వారి సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ప్రతి శుక్రవారం పోలీసు వెల్ఫేర్‌డే నిర్వహిస్తూ స్వయంగా వారి సమస్యలను విని సత్వరమే పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు.

## గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబరు 20, ప్రభాతవార్త:** నవర త్నాలు పథకంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ గృహాలు పథకం అమలుకై నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర పాలక సంస్థ కమిషనర్ డి.హరిత సూచించారు. నగరపాలక సంస్థ పరిది లోని రూరల్ నియోజకవర్గం కొండ్లపూడి ప్రాంతంలోని టిడ్కో గృహాల నిర్మాణ పనులు, జగనన్న కాలనీల్లో ఏర్పాట్లను కమిషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గృహ సముదాయాల ప్రాంగణం చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, పచ్చదనం కోసం మొక్కలు, విద్యుత్ సరఫరా, మంచినీటి సదుపాయం, విశాలమైన రోడ్లను నిర్మించి అన్ని ప్రాంతాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని సూచించారు. నగరాన్ని అనుసంధానించే ప్రధాన మార్గము నుంచి టిడ్కో గృహ సముదాయం వరకు రహదారి



పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. లబ్దిదా రులకు బ్యాంకు రుణాలు అందేలా సహకరించి మంజూరైన గృహాలను వెంటనే కేటా యించాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజ నీరింగ్ విభాగం ఎస్ఈ సంప త్‌కుమార్, డీఈ చంద్రయ్య, టిడ్కో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్



**ఇందుకూరుపేట అక్టోబర్ 19 ప్రభాతవార్త** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నవ్యాంధ్రప్రదేశ్ అబివృద్ధి పథంలో పయనిస్తుందని ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. ఇందుకూరుపేట మండలం జగదేవిపేట గ్రామంలో స్ధానిక శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రన్నకుమార్‌రెడ్డితో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గోన్న సందర్భంగా ఆయన మాట్లాడుతు 2 వేల కోట్లతో జిల్లాలో ఇరిగేషన్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. జగదేవిపాటలో 40 లక్షలతో నేర్మించిన సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపథకాలు అమలు చేస్తున్నారని పేర్కునా న్నరు. గడపగడపకు కార్యక్రమంలో ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. కోవూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 25 సచివాలయాల పరిధిలో 23 వేల ఇండ్లు తిరగి ప్రజల వద్ద సమస్యలు తెలుసుకున్నారని అన్నారు. గ్రామంలో విద్యుత్ లైన్ ఆదునీకరణ, 24 గంటలు విద్యుత్ సరఫరా, రహదారులు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. టిడిపి ప్రభుత్వం పోలవరం ,అమరావతి అంటు కాలయాపన చేశారని అభివృద్ధి శూన్యమని ఆయన విమర్శించారు. ఈకార్యక్రమంలో డిఎల్‌డిఏ చైర్మెన్ గొల్లపల్లి విజకుమార్, విజయాడైరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, తహసిల్దారు సుబ్బయ్య, ఎంపిడిఓ కల్పన, బట్టేపాటి నరేంద్రరెడ్డి, జడ్‌పి వైస్ చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మీ, దేవిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఉడతా వెంకటశేషయ్య, గూడూరు శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ వాసు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గోన్నారు.

## అందని జీతాలు..గౌరవవేతనాలు..హమాలీల కూలీలు
### -పౌరసరఫరాలసంస్థ ఉద్యోగుల గగ్గోలు



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 20 ప్రభాతవార్త** రూ. కోట్లు తిన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి..స్టేజ్-2 కాంట్రాక్టర్ బాగనేవున్నారు..వారు చేసిన నిధుల మళ్లింపు కారణంగా జీతాలు రాక ఉద్యోగులు..గౌరవవేతనాలు అందక మొబైల్‌వాహనాల వారు..కూలీలు అందక హమాలీలు అల్లాడిపోతున్నారు. వివరాల్లోకి వెలితే జిల్లా పౌరసరఫరాలసంస్థ మేనేజర్ కార్యాలయంలోని అకౌంట్ సెక్షన్ వేదికగా అక్షరాలా రూ. 29.78 కోట్ల రూపాయల ప్రభుత్వధనం పక్కదారి పట్టిన విషయం విదితమే. ఆడిట్ జరిగిన నేపథ్యంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఈ మేరకు నిధుల దుర్వినియోగం జరిగినట్లు వెల్లడి కావడం..ఇందుకు భాధ్యులుగా డిఎంతోపాటు అయిదుమంది ఉద్యోగులను సస్పెండ్ చేయడం..నిధుల మళ్ళించారన్న అభియోగంపై ఓ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, స్టేజ్-2 కాంట్రాక్టర్‌ను విధుల నుండి తప్పించిన విషయం విదితమే. భారీగా జరిగిన ఈ నిదుల దుర్వినియోగంపై జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ విచారణ జరుపుతున్న విషయం..సదరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి విధులలో చేరినప్పటి నుండి లెక్కలు తేలుస్తున్న విషయం విదితమే..ఇవన్నీ ఇలా వుండగా నిధుల మళ్ళింపు నేపథ్యంలో జిల్లాలోని పౌరసరఫరాలసంస్థ ఉద్యోగులకు జీతాలు..హమాలీలకు కూలీలు..బియ్యం తదితరాలను తెల్లకార్డుదారులకు ఇండ్ల వద్దకే తీసుకుపోయి అందజేసే మొబైల్ వాహనదారులకు గౌరవవేతనాలు అందకపోవడం గమనార్హం. అక్టోబర్ నెలకు సంబందించి రావాల్సిన ఇవన్నీ 20వ తేదీ దాటినా అందకపోతుండడంతో ఉద్యోగులు, హమాలీలు, మొబైల్ వాహనాదారులు ఆర్ధికంగా నానా అవస్థలు పడుతున్నారు. జిల్లా పౌరసరఫరాసంస్థ మేనేజర్ కార్యాలయంతోపాటు జిల్లాలోని కోవూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, బుచ్చిరెడ్డిపాలెం, పొదలకూరు, రాపూరు, నెల్లూరు, వింజమూరు, గూడూరు, వాకాడు, నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరిలలోని ఎంఎల్ఎస్ స్టాక్‌పాయింట్లలో రెగ్యులర్ ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. పౌరసరఫరాలసంస్థ ఉద్యోగులతోపాటు రెవెన్యూశాఖకు చెందినవారు కూడా ఆయా స్టాక్‌పాయింట్లలో పనిచేస్తున్నారు. వీరికి అక్టోబర్ నెల వేతనాలు ఇంతవరకు రాకపోవడం, గమనార్హం. ఇక ఆయా స్టాక్‌పాయింట్లలో 200 మంది వరకు హమాలీలు పనిచేస్తున్నారు. వీరికి అక్టోబర్ నెలకు సంబందించిన బిల్లులు ఇవ్వకపోగా ప్రతిఏటా దసరా పురస్కరించుకొని ఇచ్చే 3 జతల బట్టలు, కుట్టుకూలీ, స్వీట్‌బాక్స్, బోనస్ ఇవ్వకపోవడం గమనార్హం. ఇక బియ్యం తదితరాలను కార్డుహోల్డర్ల ఇండ్ల వద్దకు వెళ్లి అందజేసే ఎండీయు వాహనాల వారికి గౌరవవేతనాలు నేటికీ అందలేదు. నిధుల స్కామ్ నేపథ్యంలో ఇక్కడ చెక్కులు క్యాష్ కాకపోతుండడంతో అవి బ్యాంక్‌లు..రాష్ట్ర పౌరసరఫరాలసంస్థ కార్యాలయానికి మధ్య చెక్కర్లు కొడుతున్నాయి. నిధులు దిగమింగిన వారు బార్లు,,విల్లాలు..కార్లు కొనుకొన్ని దర్జాగా వుండగా నెలజీతాల మీ ద ఆధారపడి జీవించే వీరంతా వారి పుణ్యాన అలమటిస్తుండడం గమనార్హం.

# రాష్ట్రాన్ని పాలించేది మూడుపెళ్లిళ్ల పవన్‌కల్యానా?

### ఆయనకు పొత్తు చంద్రబాబా
### ...మంత్రి కాకాణి

**దగదర్తి, అక్టోబర్20, ప్రభాతవార్త:** సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే హిందూ భారతదేశంలో మూడు పెళ్ళిళ్ళు చేసుకున్న పవన్‌కళ్యాణా రాష్ట్రాన్ని పాలించేది, వై.సి.పిని విమర్శించేది అంటూ వ్యవసాయాశాఖా మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి పవన్‌కళ్యాణ్, చంద్రబాబులపై విరుచుకు పడ్డారు. చెప్పులు చూపించడం అందరూ చేయగలరని గౌరవ, మర్యాదలకు లోబడి తాము ఊరకున్నామని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి హెచ్చరించారు. బట్టలను



మార్చినంత సులువుగా పెళ్ళాలను మార్చే పవన్ కారుకూతలు కూసి చెప్పులు చూపిస్తే చంద్రబాబు వెళ్ళి పవన్‌కళ్యాణ్‌ను కలవడం సిగ్గుచేటన్నారు. గతంలో తాను బి.జె.పి మనిషి నంటూ మోదీ అభిమానినని చెప్పుకున్న పవన్‌కళ్యాణ్ బి.జె.పి తనకు సహకరించలేదంటూ టి.డి.పికి మద్దతిస్తాననడం ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. వై.సి.పి గూండాలు నాయకులను తోలువలుస్తానంటూ ఒక నాయకుడిగా వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. కావలి ఎం.ఎల్.ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్టాడుతూ వై.సి.పి అధినేత జగన్ నేతృత్వంలోనే పార్టీ ఎం.ఎల్.ఎలు నాయకులు క్రమశిక్షణతో కూడిన నిబద్ధతకలిగిన నాయకులన్నారు. వై.సి.పి నాయకులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయవద్దని వై.సి.పి నేతలు రెచ్చిపోతే ఆపడం ఎవరితరం కాదన్నారు. ఈకార్యక్రమంలో దగదర్తి ఎం.పి.పి తాళ్ళూరు ప్రసాద్‌నాయుడు, పెనుమల్లి వివేక్‌రెడ్డి, మహేష్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాలలకు కొత్త రూపురేఖలు



**కందుకూరు, అక్టోబర్20, ప్రభాతవార్త:** వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం విద్యా విధానంలో మార్పులు తీసుకుని వచ్చినట్లు శాసనసభ్యుడు మానుగుంట మహీధర్‌రెడ్డి తెలి పారు.నాడు-నేడు కార్యక్రమం ప్రవేశపెట్టి నిధులు కేటాయించి పాఠశాలలకు కొత్త రూపురేఖలు తెచ్చారన్నారు.గురువారం బాలికల ఉన్నత పాఠశాల ప్రాంతంలో అధనపు తరగతి గదుల నిర్మాణం కొరకు శంకు స్థాపన నిర్వహించారు.1కోటి 94 లక్షల వ్యయంతో 16రూములు నిర్మించనున్నారు.ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు,విద్యాశాఖ అధికారుల సమక్షంలో నిర్ మ్మాణ పనులకు భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా్డుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలో ప్రభుత్వ పాఠశాలలు పూర్తిస్థాయిలో మారాయన్నారు.విద్యా విధానంలో కూడా మార్పులు వచ్చినట్లు చెప్పారు.మౌళిక వసతులు ఏర్పాటు చేసి పేద విద్యార్థులు చదువుకునేందుకు సకల సౌకర్యాలు కల్పించామన్నారు.ఇప్పుడు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కిటకిటలాడుతున్నాయని చెప్పారు.హాజరు శాతం పెరిగి విద్యార్థుల్లో కూడా చదువుపట్ల ఆసక్తి పెంచుకుని ఉన్నత స్థాయికి వెళ్తున్నట్లు వివరించారు.2019 నవంబర్‌లో నాడు-నేడు పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.ఇందుకోసం ఏటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని పేర్కొన్నారు.హామీ ఇచ్చి నెరవేర్చిన ఎమ్మెల్యే.కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి ఒక వికలాంగుడికి హామీ ఇచ్చి వెనువెంటనే నెరవేర్చిన సంఘటన జరిగింది.ఇటీవల మండలంలోని విక్కిరాలపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆ సమయంలో ఒక దివ్యాంగుడు మూడు చక్రాల వాహనం రిక్షా కావాలని ఎమ్మెల్యేని అడిగారు.దీంతో ఆయన స్పందించి సొంత ఖర్చులతో ఓ రిక్షాను కొని ఆ వికలాంగుడికి గురువారం అందించారు.

## ఎమ్మెల్సీగా శ్రీకాంత్‌ను గెలిపించండి

**నెల్లూరు అక్టోబర్ 20, ప్రభాతవార్త-వైద్యం :** జరగనున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తూర్పు రాయలసీమ ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల అభ్యర్థి కంచెర్ల.శ్రీకాంత్‌ని భారీ మెజార్టీతో గెలిపించి విద్యార్థుల భవితకు బాట వేయండని తెలుగుదేశం పార్టీ నాయకురాలు మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాళ్ళపాక.అనూరాధ కోరారు. గురువారం నగరంలోని ట్రంక్‌రోడ్డు, తిప్పరాజు సత్రం, జొన్నలగడ్డ వారి వీధి, ఆర్‌ఆర్ వీధుల్లో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా అనూరాధ ప్రచారం చేస్తూ అభ్యర్థి కరపత్రంతోపాటు ఫామ్-18 అప్లికేషన్ అందించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుంటేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని ఆమె వెల్లడించారు. జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రంలోని పేద విద్యార్థులు చదువులకు దూరం కావాల్సి వచ్చిందన్నారు. ఇప్పుడైనా విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే పట్టభద్రులందరూ ఏకమైఈ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల్లో శ్రీకాంత్‌ని ఖచ్చితంగా గెలిపించుకోవాల్సి న అవసరం ఎంతైనా ఉందని ఆమె పట్టభద్రులకుపిలుపునిచ్చారు.ఈ ప్రచారంలో నాయకులు ఖజాన.బ్రహ్మయ్యఆచారి, విజనపల్లి.సుగుణ, చెవుల.వంశీకృష్ణ, ఉపేంద్ర, విజనపల్లి.పూర్ణకళాధర్ పాల్గొన్నారు.

## డిఆర్‌డిఏ సీసీ కుటుంబానికి ఆర్థికసాయం



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 20 ప్రభాతవార్త:** ఉమ్మడి నెల్లూరుజిల్లాలోని తడ మండలంలో జిల్లా గ్రామీణాభివృద్ధిసంస్థ (డిఆర్‌డిఏ) కి సంబంధించి కమ్యూనిటీ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తూ మరణించిన పరమయ్య కుటుంబానికి సంస్థ సిబ్బంది ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందజేశారు. మొత్తం రూ. 3.20 లక్షల రూపాయలను చెక్ రూపంలో డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కేవీసాంబశివారెడ్డి ద్వారా పరమయ్య భార్యకు ఇప్పించారు. గురువారం కలెక్టరేట్ ఆవరణంలోని డిఆర్‌డిఏ కార్యాలయంలో పరమయ్య భార్యకు ఈ మేరకు చెక్ అందజేసిన పీడీ ఆ డబ్బును పిల్లల పేరుతో డిపాజిట్ చేయాలని సూచించడంతోపాటు భర్తను కోల్పోయిన ఆమెకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## పంచాయితీరాజ్ ఇంజనీర్ల ఆందోళన నిలిపివేత



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 20 ప్రభాతవార్త:** న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దశలవారీగా ఆందోళనా కార్యక్రమాలు చేపట్టిన పంచాయితీరాజ్ ఇంజనీర్లు ఆయా డిమాండ్లపై ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇవ్వడంతో తమ ఆందోళనను విరమించారు. 1.10.2018-31.05. 19 మధ్యకాలంలో జరిగిన ఉపాధి హామీపథకం పనులు, ఎస్‌డీఎఫ్ పనులకు సంబంధించి పంచాయితీ రాజ్ ఇంజ నీర్లపై ఎటువంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోకూడదని, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల (రైతుభరో సాకేంద్రాలు, సచివాలయాలు, డిజిట ల్‌లైబ్రరీలు) నిర్మాణాలకు సకాలంలో సిమెంట్, స్టీల్ తదితరాలు సరఫరా కాకపోవడం, చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడం కారణంగా నిర్దేశించిన గడువులో ఆయా భవనాల నిర్మాణం పూర్తికానందుకు పం చాయితీరాజ్ ఇంజనీర్లకు బాధ్యులను చేయవద్దని అలాగే ఎటువంటి విచారణ, తగిన కారణాలు లేకుండా పంచాయితీరాజ్ ఇంజనీర్లపై చర్యలు తీసుకోవద్దని...ఖాళీగా వున్న ఏఈ-ఏఈఈ పోస్టులను తక్షణమే భర్తీచే యాలని...ప్రభుత్వ పనులకు సరఫరా చేస్తున్న సిమెంట్ నిల్వచేసుకొనే గోడవున్లు లేనందున ఆ పద్ధతిని రద్దుచేయాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇక శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు, డేటా ఎంట్రీఆపరేటర్లకు, సాంకేతిక సహాయకులకు ప్రతినెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని..డీఈఈలకు ఆరు నెలలుగా చెల్లించాల్సి న వాహనాల అద్దెలను చెల్లించాలని..ఏఈ-ఏఈఈలకు ఏడాదిగా చెల్లించాల్సి న ఫిక్స్‌డ్ టీఏను చెల్లించాలని..కొత్తగా ఏర్పాటైన జిల్లాలకు ఎస్‌ఈ, ఈఈ పోస్టులను మంజూరు చేయాలని పంచాయితీరాజ్ ఇంజనీర్లు డిమాండ్ చేస్తున్న విషయం విదితమే.. న్యాయమైన డిమాండ్ల సాధనకై ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ ఇంజనీర్ల సంఘ సంయుక్త కార్యాచరణ సమితి ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా పంచాయితీరాజ్ ఇంజనీర్లు ఈనెల 13వ తేదీ నుండి దశలవారీగా నిరసన కార్యక్రమాలకు పూ నుకున్న విషయం విదితమే. 13 నుండి 15 వరకు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు అయిన పంచాయితీరాజ్ ఇంజనీర్లు 17 నుండి 19వ తేదీ వరకు బోజన విరామ సమయంలో ఎస్‌ఈ, ఈఈ, డివిజన్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇక 20వ తేదీ విజయవాడలోని పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ చీఫ్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించడం, 24వ తేదీ నుండి సహాయ నిరాకరణ చేయాల్సి వుండగా గురువారం ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీలు అందడంతో ఆందోళనా కార్యక్రమాలకు స్వస్తి పలికారు. ఈ సందర్భంగా గురువారం విజయవాడలోని పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ చీఫ్ కార్యాలయంలో జరిగిన విజయోత్సవసభలో పాల్గొన్న జిల్లా పంచాయితీరాజ్ ఇంజనీర్ల సంయుక్త కార్యాచరణ కమిటీ ప్రతినిధులు జేఏసీ చైర్మన్ టి.శ్రీనివాసులరెడ్డి, సెక్రటరీ జనరల్ మున్వర్, వైస్‌చైర్మన్లు బాబూరావు-ఎం.శ్రీవాసు, జేఏసీ పీఎస్‌చంద్రశేఖర్, ఎల్.పరమేష్, వీవీదయాల్, జీవిసత్యనారాయణ, ఎన్.లక్ష్మీనారాయణ, పీఎస్‌మునికుమార్, యుజీసునీల్, టి.సుబ్రమణ్యం, ఎన్.నాగశంకర్‌సింగ్, జేసీశ్రీధర్, ఎస్‌కెరఫీలు న్యాయమైన తమ డిమాండ్లపై లిఖితపూర్వకంగా హామీ ఇచ్చిన ప్రభుత్వానికి..పంచాయితీరాజ్ ఇంజనీర్ల ఆందోళనా కార్యక్రమాలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## 'మందాడి'కి ఘనంగా కన్నీటి వీడ్కోలు

### -కేతిగుంటలో విషాదచాయలు



మర్రిపాడు, అక్టోబర్20, ప్రభాతవార్త: మర్రిపాడు మండలం కేతిగుంటకు చెందిన మందాడి నర్సింహులు నాయుడు (50) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. నర్సిం హులు నాయుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా కేతిగుంట ప్రాధమిక పాఠ శాలలో పనిచేస్తున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధప డు తున్నాడు. తన స్వగృహంలోనే బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు . ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే రాజకీయరంగంలోకూడా నర్సింహులు నా యుడుకు తనకంటూ గుర్తింపు పొందాడు . తనదగ్గరకు వచ్చే వారిపట్ల సమస్యలను పరిష్కరించి ప్రజా నాయకుడిగా పేరు పొందాడు. కేతిగుంట, పొంగూరు, భీమవరం తదితర గ్రామాల్లో తన సోదరుడు ,మాజీ సర్పంచ్ మందాడి శ్రీనివాసులునాయుడు సహకారంతో పలు నూతన దేవాలయాలకు ఆర్థికసహకారమందించారు . నర్సింహులునాయుడు మృతిపట్ల కేతిగుంట గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఉపాధ్యాయవర్గాలు, నర్సింహులునాయుడు స్నే హితులు, అభిమానులు పెద్ద సంఖ్యలో కేతిగుంటకు వెళ్ళి మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళుల ర్పించారు. ఈయనకు భార్య, కుమారుడు గలరు . మృతదేహం వద్ద బంధువులు విలపిస్తున్న తీరు చూప రులకు కంటతడిపెట్టించింది. నర్సింహులు నాయుడు మృతదేహానికి బంధువులు, ఉపాధ్యాయులు, అభి మానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్థానిక స్మశానవాటికలో ఘనంగా కన్నీటి వీడ్కోలు పలికారు. స్థానిక స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

## పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన




**బుచ్చి అక్టోబర్ 20 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెం డిఎల్ఎన్ఆర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు పోటీ పరీక్షల నిమిత్తం కావా ల్సిన స్కిల్స్ మరియు కెరియర్ గైడెన్స్ గు రించి నేషనల్ కెరియర్ సర్వీస్ పోర్టల్, నెల్లూరు మోడల్ కెరియర్ సెంటర్ వారు అవ గాహన కల్పించారు.సెట్నెల్ సిఇఒ పుల్లయ్య, సురేష్‌బాబు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## నోటు పుస్తకాలు,పెన్సిళ్ళు పంపిణి



**జలదంకి, అక్టోబర్20, ప్రభాతవార్త:** స్థానిక ఎస్.సి.హెచ్,ఎస్.టి అంగన్‌వాడీ కేంద్రాలు,పంచాలతీ పరిధిలోని నెహ్రూనగర్ గిరిజన కాలని ప్రాధమిక పాఠశాలవిద్యార్థులకు జలదంకి నందా ఎలక్ట్రానిక్స్ అధినేత బోగోలు రత్నాచారి గురువారం నోటు పుస్తకాలు ,పెన్సిళ్ళు,ఎరైజర్లు పంపిణిచేశారు.తన మనుమడు ఎం.గిరీష్ నందా జన్మదినం సందర్భంగా పేదపిల్లలకు ఉడతాభక్తి సాయం చేయాలని సంకల్పించి విద్యాసామగ్రి అందజేసినట్లు తెలిపాడు.తామూ పేదరికాన్ని అనుభవించినా తనకుమార్తెను ఉన్నత చదువులు చదవించి ప్రయోజకుల గా తీర్చిదిద్దామని చెప్పారు.పేదరికంతో ఎవ్వరు చదువులకు దూరం కాకూడదన్న సంకల్పంతో ఈచిరు సాయంకు పూనుకున్నామన్నారు.రత్నాచారి కుమార్తె మాధవి,అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.విజయ,సుగుణ,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవతి,ఉపాధ్యాయురాలు రేవతి పాల్గొన్నారు.

## జగనన్న విద్యాదీవెనకు ఈకెవైసి చేయించుకోవాలి



**వరికుంటపాడు, అక్టోబర్20, ప్రభాతవార్త:** 2021,22 విద్యాసంవత్సరానికి జగనన్న విద్యాదీవెన అమలు కావాలంటే విద్యార్థులు తప్పక ఈకెవైసి చేయించు కోవాలనివెల్ఫేర్ అసిస్టెంటు కొండపనాయుడు ,బాల గంగులు,వెంకయ్యబా బు, మహేష్‌లు సూసించారు.గురువారం మండలంలోని రామాపురం, తూర్పు బోయమడుగు ల,కాం చెరువు,జి.కొండారెడ్డిపల్లి సచివాలయ పరిధిలో గ్రామ వాలంటీర్లతో సమావేశాలు నిర్వ హిం చారు.ఈనెల 31వతేదీ లోగా విద్యాదీవెన నాల్గవవిడత సంబందించిన విద్యార్థులందరూ బయోమెట్రిక్ వేయాలని ఒకవేళ విద్యార్థులు అందుబాటులో లేకపోతే వారు చదివే కళాశాల దగ్గర్లోనే సచివాలయం వద్దకు వెళ్ళి బయోమెట్రిక్ వేయాలని తెలిపారు. ఈసంబంధిత విషయాన్ని గ్రామ వాలంటీర్లు తమ పరిధిలోని అర్హులైన వారందరికి తెలియజేయాలన్నారు.

## కొండాపురం రెగులర్ వైద్యాధికారిగా నసీరుద్దీన్

**కొండాపురం, అక్టోబర్20, ప్రభాతవార్త:** మండలకేంద్రమైన కొండాపు రంలో వున్న ప్రభుత్వ వైద్యశాలకు రెగ్యులర్ వైద్యాధికారిగా షేక్.న సీరుద్దీన్ నియమితులైనట్టు ఆయన తెలిపారు.గురువారం ఆయన వైద్యశాలలో భాద్యతలు స్వీకరించారు.ఇప్పటి వరకు ఆయన సాయిపేటలో విధులు నిర్వర్తిస్తున్నా రు.సాయిపేటనుంచి కొండాపురం బదిలీపై వచ్చారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండా పురంలో తాము ఎల్లప్పుడు రోగులకు అందుబాటులో వుంటామని చెప్పారు.వైద్య సమస్యలు ఎవరికైనా వచ్చిన వెంటనే సంప్రదించాలని పిలుపునిచ్చారు.ప్రవేటు వైద్యశాలలకువెళ్ళి డబ్బులు ఖర్చుచేసు కోవద్దన్నారు.ప్రభుత్వ వైద్యశాలలోనే మెరుగైన వైద్యం అందుతుందన్నారు.

## సి.ఎం రిలీఫ్ చెక్కు పంపిణి



**వరికుంటపాడు, అక్టోబర్20, ప్రభాతవార్త:** మండలంలోని టి.కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఏనుగు.రామకృ ష్ణారెడ్డికి మంజూరైన సి.ఎం రిలీఫ్ ఫండ్ చెక్కు నుఎం.ఎల్.ఎ మేకపాటి. చంద్రశేఖరరెడ్డి గురువారం పంపిణీచేశా రు.ఈ కార్యక్రమంలో మండల వై.సి.పి కన్వీనర్ అంద్రా బాలగురువారెడ్డి,సొసైటి అధ్యక్షులు కామేపల్లి.వెంకటరత్నం,ప్రముఖ పారిశ్రామికవేత్త వై.సి.పి నాయకుడు ఎర్రా.చిన బ్రహ్మయ్య,నేతలు మాగంటి.తిరుపతి,ఏనుగు.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యాదవ సోదరులు తరలిరావాలి



**వరికుంటపాడు, అక్టోబర్20, ప్రభాతవార్త:** యాదవ ఎంప్లాయిస్ సొసైటీ ఆద్వర్యంలో నెల్లూరులో ఈనెల 23వతేది ఆదివారం జ రుగు ఎంప్లాయీస్ సొసైటి భవనప్రారంభో త్సవానిక యాదవులు తరలిరావాలని య దవ ఎంప్లాయీస్ సొసైటి నాయకుడు పోలు బోయిన ఉప్పు కొండయ్య యాదవ్ పిలుపునిచ్చారు.గురువారం యాదవ ఎంప్లాయీస్ సొసైటి భవన ప్రారంభోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించి యాదవ పెద్దలకు మిత్రు లకు,యాదవ ఎం ప్లాయీస్‌కు పంపిణీచేశారు.ఈకార్యక్రమంలో యాదవ సభ్యులు కాపు.నాగేశ్వరరావు,డబ్బు కొట్టు.శ్రీని వాసులు,పోలుబోయిన.మనోహర్,సువర్ణ,మృధుల,తదితరులు పాల్గొన్నారు.

## కీటక జనిత వ్యాధులపట్ల అప్రమత్తంగా వుండాలి



**వరికుంటపాడు, అక్టోబర్20 ,ప్రభాత వార్త:** కీటక జనిత వ్యాధులు సోక కుండా ప్రజలు అప్రమత్తంగా వుండాలని మలేరియా సబ్‌యూనిట్ అ ధికారి నౌషద్‌బాబు అన్నారు.గురు వా రం స్థానిక ప్రాధమిక ఆరో గ్యకేంద్రంలో వైద్య సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించా రు.ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన వాతావరణ పరిస్తితుల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం వున్నందున ప్రజలను జాగ్రత్తలు తీసుకునేలా చైతన్య పరచాలన్నారు.దోమలద్వారా వ్యాపించే మలే రియా,డెంగీ ,చికెన్‌గున్యా,జ్వరాలు సోక కుండా పరిశుభ్రతను పాటించాలన్నారు.ఎబ్బెట్ ద్రావణం పిచికారి చేయించడంతోపాటు బ్లీచింగ్ చల్లించాలన్నారు.ఈకార్యక్రమంలో సి.హెచ్.ఒ రాజశేఖరరాజు,పి.హెచ్‌న్ సుశీలమ్మ,సిబ్బంది పాల్గొన్నారు.

## కారు ఢీ...వడ్ల దళారికి గాయాలు

**మనుబోలు, అక్టోబరు 20 ప్రభాతవార్త** చెన్నై-కలకత్తా రహదారిపై గురువారం ఉదయం పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా నెల్లూరు మార్గంలో గుర్తు తెలియని కారు వడ్ల దళారి మోటార్‌సైకిల్‌ని ఢీకొంది.ఈ ప్రమాదంలో పొలనకుదురు గ్రామానికి చెందిన వడ్ల దళారి ఎస్.కె.అల్లాబక్షుకు గాయాలు తగిలాయి. పొలనకుదురు నుండి నెల్లూరుకు వెళ్తుండగా బస్ షెల్టర్ వద్ద వేగంగా వెళ్తున్న కారు అలాబక్షు మోటార్‌సైకిల్‌ని ఢీకొంది. గాయపడిన ఆయనను గూడూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## ఎఐసిసి సభ్యులుగా బాలసుధాకర్



నెల్లూరు కార్పొరేషన్, అక్టోబరు 20, ప్రభాత వార్త: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు త లారి బాలసుధాకర్ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమి టీ (ఏపీసీసీ) సభ్యులుగా నియమితులైన సందర్భంగా ఆయనను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు బాలసుధాకర్‌కు అభినందనలు తెలిపారు. బాలసుధాకర్ ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వా కర్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఉన్నారు. మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కనకట్ల ముదిరాజ్, గౌరవ అధ్యక్షులు కిలారి తిరుపతినాయుడు, సభ్యులు బాసం శేషగిరిరావు, దద్దోల రమణయ్యగౌడ్, రాఘవేంద్రరెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, జి.వి.రత్నం, పాబోలు సత్యం,హరిప్రసాద్, గోపాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీధర్, నారాయణరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సుధాకర్‌చౌదరి, శ్రీనివాసరావు, బాలరామయ్యనాయుడు, బాశం సత్యం పాల్గొన్నారు.

## సచివాలయం తనీఖి



**ఉదయగిరి అక్టోబర్ 20 ప్రభాత వార్త** ఉదయగిరి మండలంలోని నేలటూరు గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ హైజాక్ ప్రవీణ్ తనీఖి చేశారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందికి తగిన సూచనలు చేస్తు భయెమెట్రిక్ హాజరు 100 శాతం ఉండాలని సిసి చార్జిలు అందరు కట్టాలని క్లాప్ మిత్రాలకు నూరు శాతం జీతాలు చెల్లిం చాలని సూచించారు. సిబ్బంది లో ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో ఉండాలని సమయానికి సచివాలయానికి హా జరై యూనిఫాం ధరించాలని సూచించారు.సచివాలయానికి వచ్చే ప్రజలకు పూర్తి స్థాయిలో ప్రభుత ్వం అంద జేసే సంక్షేమ పథకాల గురించి తెలియజేయాలని అన్నారు.త్వరలో ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి గడపగడప కార్యక్రమం ఉంటుందని కనుక అందరు సిద్దంగా ఉండి రికార్డులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి పంచాయితీ కార్యదర్శి మహబూబాషా, మండల కో ఆర్డినేటర్‌గాజుల ఇమ్రాన్, సచివాలయ సిబ్బంది,వాలింటరీలు ఉన్నారు.

## షిరిడీ సాయినాధుని సేవలో బాబా భక్తులు

**నెల్లూరు అక్టోబర్ 20 ప్రభాతవార్త-హరనాధపురం** నగరంలోని బాలాజీనగర్ అద్దాల సాయిబాబా(సాయి దర్బార్) మందిర నిరా ్వహకుల ఆధ్వర్యంలో 400మంది బాబా భక్తులు షిరిడీ చేరుకుని గురువారం బాబాను దర్శించుకున్నారు. ఉదయం షిరిడీ పురవీధుల్లో మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ సాయినామ సంకీర్తనలతో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. సాయి ఆరాధనా క్షేత్రం నుండి ప్రారంబమయిన ఈ ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. అనంతరం పింపుల్‌వాడి రోడ్డు మీదుగా ఖండోబా మందిరం వరకు అక్కడి నుండి సంస్థాన్ రోడ్డు చావడి, ద్వారకామాయి మీదుగా సమాది మందిరం వద్దనున్న గురుస్థాన్ నంద దీపం, రావి చెట్టుకు ప్రదక్షణలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా సాయిదర్బార్ చైర్మన్ మధు సాయి మాట్లాడుతూ షిరిడీ యాత్రలో భాగంగా పెద్దసంఖ్యలో బాబా మాలలు ధరించి బాబాను దర్శిం చుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏడాది షిరిడీ యాత్రను నిర్విరామంగా కొనసాగిస్తున్నామని, నేడు షిరిడీ పురవీధుల్లో పల్లకీ ఉత్సవాలను నిర్వహించనున్నామని, బాబా అనుగ్రహంతో ఇంతటి సత్కార్యాన్ని నిర్విగ్నంగా కొనసాగిస్తునామని పేర్కొన్నారు.

## చెత్త రిక్షాల్లు పంపిణీ

**మనుబోలు, అక్టోబరు 20 ప్రభాతవార్త** స్వచ్ఛ భారత్‌లో భాగంగా మనుబోలు మండలంలోని వివిధ పంచాయతీలకు 21 చెత్త రిక్షాలను గురువారం సాయంత్రం పంపిణీ చేశారు. ఇవోపిఆర్‌డి పుట్టా రమణయ్య ఆధ్వర్యంలో ఆయా పంచాయతీ కార్యదర్శులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మనుబోలు పంచాయతీ కార్యదర్శి ఆత్మకూరు వెంకట రమణ, రాజేశ్వరి, సోని, అనిత, తదితరులు పాల్గొన్నారు.

## వై.సి.పికి సైనికుల్లాగా పనిచేస్తాం



ముత్తుకూరు, అక్టోబర్20, ప్రభాతవార్త: దివంగత ముఖ్య మంత్రి వై.ఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు వై.ఎ స్.ఆర్ కాంగ్రేస్ పార్టీని స్థాపించా అధికారంలోకి తీసు కువచ్చి ప్రజల మన్ననలను పొందుతున్న నవ్యాంధ్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వ్యవసాయశాఖా మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి,మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధనరెడ్డి వారి అడుగు జాడల్లో సైనికుల్లా పని చేస్తామని సర్వేపల్లి నియోజకవర్గం వై.సి.పి సోషల్ మీడియా కన్వీనర్ గుడి.ఉదయభాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం వ్యవసాయశాఖా మంత్రి కాకాణి.గోవర్ధనరెడ్డి, మండలకన్వీనర్ విష్ణువర్ధనరెడ్డిని కలిసి శాలువాలతో సత్కరిం చారు.ఈసం దర్భంగా ఉదయభాస్కర్‌రెడ్డి మా ట్లడుతూ వై.సి.పి పాలనలో ప్రజలు ఆనం దంతో వుండారన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నా రన్నారు.సచివాలయ వ్యవస్త అనేదిఒక చారిత్రాత్మకమైన వ్యవస్తన్నారు.దీనివల్ల ప్రజా సమ స్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. కోకన్వీ నర్లగా గుంజి.రమేష్,ఎస్.కెఖాదర్ బాషా ,పిల్లేటి.పవన్‌కుమార్‌రెడ్డి,షేక్. గౌష్‌బాషా,పులి.వెంకటేశ్వ ర్లురెడ్డి, ఉడతా.పవన్‌లను నియమితులు చేసినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కృ ష్ణాపట్నం కు చెందిన గుడి ఉదయభాస్కర్‌రెడ్డి కోకన్వీనర్‌గా నియమితులైనందుకు గ్రామ స్తులు హర్షం వ్యక్తంచేశారు.

## రైతులకు సబ్సిడిపై వరి విత్తనాలు



**ముత్తుకూరు, అక్టోబర్20, ప్రభాతవార్త:** ముత్తుకూరు మండలంలోని బ్రహ్మదేవం రైతుబరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీపై వరివిత్తనాలు పంపిణీ చేయడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి వాసుదేవారావు అన్నారు.గురువారం వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి ఆదేశాలతో మండల అగ్రికల్చర్ ఆఫీసర్‌తో కలసి వరివిత్తనాలు పంపిణీచేయడం జరిగిందన్నారు.రైతులు వరి విత్తనాలు కావలసిన వారు నేరుగా రైతు బరోసా కేంద్రాలకు వచ్చి విత్తనాలు తీసుకోవ చ్చన్నా రు.బి.పి.ట "27కెజీల బ్యాగు 937.50పైసలు సబ్సిడి 125రూపాయలు పోను 812,50పైసలు రైతులు కట్టా లన్నారు.అలాగే ఎన్.ఎల్.ఆర్ 34449 ముపైకెజీల బ్యాగు సబ్సిడీ పోను 865.10పైసలు,అలాగే షుగర్ లెస్ 25కెజిల బ్యాగ్ సబ్సిడిపోను 786.25పైసలకి రైతులకు విత్తనాలు అందుబాటులో వున్నా య న్నారు.రైతులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాల న్నారు.ఈకార్యక్రమంలో ఇందుకూరుపేట వ్యవ సాయ సహాయక సంచాలకులు రాజకుమార్,మండల అగ్రిక ల్చర్ అదికారి జ్యోష్ణారాణి,మండల కోఆప్షన్ సభ్యులు ఎస్.కె జమీల్‌బాషా,సర్పంచ్ ఎందో టి.సుధా కర్,మాజీ కోఆప్షన్ అభ్యులు బషీర్,సచివాలయం కార్యదర్శి నిరంజన్,వ్యవసా హాయకులు శ్రీనివాసులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై వరి విత్తనాలు

**చేజర్ల, అక్టోబర్20, ప్రభాతవార్త:** మండలంలోని రైతులకు అవసరమైన వరివిత్తనాలను సబ్సిడీపై అందజేసేందుకు సిద్ధంగా ఉన్నాయని చేజర్ల మండల వ్యవసాయాధికారి వి.శశిధర్ పేర్కొన్నారు. ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణా మసూర), ఎన్ఎల్ఆర్ 34449 వరివిత్తనాలను మండలంలో వరి సాగుచేసే గ్రామాలకు సబ్సిడీపై అందిస్తామన్నారు. అవసరమైన రైతులు రైతు భరోసా కేంద్రాల్లోకి వెళ్ళి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు . తెలంగాణా మసూర పూర్తి ఖరీదు 911-25రూపాయలు కాగా 125రూపాయలు సబ్సిడీ పోను 786-25రూపాయలకు , నెల్లూరు మసూర 1010-10రూపాయలు కాగా 150రూపాయలు సబ్సిడీపోను 860-10రూపాయలకు రైతు వాటా చెల్లించాల్సి ఉంటుందన్నారు. చేజర్ల, మాముదూరు, తూర్పుపల్లి, యనమదల , వావిలేరు, పాతపాడు రైతు భరోసాకేంద్రాల్లో వరివిత్తనాలు తెప్పించామని మిగిలిన ఆర్‌బికెలలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారికి మాత్రమే అందిస్తామన్నారు .

## ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలి



కొడవలూరు అక్టోబర్ 20 ప్రభాతవార్త : కొడవలూరు మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు గురువారం రాబోవు పట్టభద్రుని ఎన్నికల దృష్ట్యా ఓటు నమోదు చేసుకునేందుకు నమోదు పత్రంను ఎంపిడిఓ సుబ్రహ్మణ్యంకు డీసీఎమ్మెస్ వీరి చలపతిరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుని ఎన్నికల ఓటు అర్హత కలిగాన ప్రతి పౌరుడు, ఓటు హక్కును వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

## బారాషహీద్ దర్గా పరిరక్షణ కమిటీ ప్రమాణ స్వీకారం



నెల్లూరు టౌన్, అక్టోబరు 20, ప్రభాతవార్త: నెల్లూరు నగరం దర్గామిట్టలోని బారాషహీద్ దర్గా ప్రాంగణంలో గురువారం బారాషహీద్ దర్గా పరిరక్షణ కమిటీ 2022-23 సంవత్సరానికి గాను ప్రమాణస్వీకారం జరిగింది. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ బారాషహీద్ దర్గా ప్రతిష్టను పెంచేలా ఈ కమిటీ పని చేయాలని సూచించారు. అలాగే అభివృద్ధికి తాను సైతం తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. నూతనంగా ఏర్పడ్డ ఈ కమిటీ దర్గా అభివృద్ధికి కృషి చేసి మంచి పేరు తేవాలని కోరారు. తన సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఈ కమిటీ అధ్యక్షుడుగా షేక్ ఇస్మాయిల్ ఖాదరి, ఉపాధ్యక్షులుగా షేక్ అమీర్‌జాన్, షేక్ ఇంతియాజ్, సెక్రటరీగా షేక్ జిలానీ, జాయింట్ సెక్రటరీలుగా షేక్ సందానీబాషా, చిన్నమస్తాన్, ట్రెజరర్‌గా కరిముల్లా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాయబ్ రసూల్, సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు.

## గుంటూరు-తిరుపతి ప్యాసింజర్ రైలును పునరుద్ధరించండి

**బిట్రగుంట, అక్టోబరు 20 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో కరోనా సాకుతో గత రెండు సంవత్సరాల క్రిందట నిలుపుదల ఎత్తివేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ళను నిలుపుదల చేసే విషయంలో చర్యలు తీసుకోవాలని డివిజనల్ ఎడిఆర్‌యం శ్రీనివాస్‌కు బిట్రగుంట రైల్వే అభివృద్ధి కమిటీ విజ్ఞప్తి చేసింది. డివిజన్ పరిధిలోని బిట్రగుంట రైల్వే స్టేషన్‌కు గురువారం పలు తనిఖీలకు విచ్చేసిన ఎడిఆర్‌యంకు రైల్వే అభివృద్ధి కమిటీ వినతి పత్రాన్ని అందజేసింది. గుంటూరు-తిరుపతి మధ్య నడిచే ప్యాసింజర్ రైలును యధావిధిగా నడపాలని, కరోనా విపత్తుకు ముందు బిట్రగుంట రైల్వే స్టేషన్‌లో నిలుస్తున్న బొకోరో, లక్నో, అండమాన్ ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కాకినాడ ప్యాసింజర్ రైళ్ళకు హాల్టింగ్ ఇవ్వాలని కోరారు. బిట్రగుంటలో క్రూ చేజింగ్ వల్ల ఇప్పటికే బొకోరో, అండమాన్ ఎక్‌ప్రెస్, తిరుపతి-కాకినాడ ప్యాసింజర్ రైళ్లు నిలుస్తున్నాయని వీటికి టికెట్లు విక్రయిస్తే రైల్వేకి ఆదాయం, ప్రయాణికులకు సౌకర్యంగా వుంటుందన్నారు. బిట్రగుంట రైల్వే స్టేషన్ రోడ్డు మూసివేతపై ఐవోడబ్ల్యు అధికారి సత్యనారాయణ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఫిర్యాదు చేయగా పై సమస్యలన్ని సానుకూలంగా పరిశీలిస్తానని వారికి ఆయన హామీఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో రైల్వే అభివృద్ధి కమిటీ కన్వీనర్ ఎస్.కె.నూరుద్దీన్, సభ్యులు ఖాదర్‌బాషా, అహ్మద్, నెల్లూరు చంద్రశేఖర్, వెంకట శేషయ్య, నవీద్, గంటా సుధీర్, జైభీమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు బత్తుల రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## కావలి మున్సిపాల్టీ 3వ డివిజన్ ఇన్స్‌పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



**కావలి, అక్టోబరు 20 ప్రభాతవార్త** కావలి మున్సిపాల్టీ 3వ డివిజన్ ఇన్‌చార్జ్ ఇన్స్‌పెక్టర్ ఉమామహేష్‌పై చర్యలు తీసుకోవాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు. గురువారం కావలి ఆర్డీవో కార్యాలయంలో ఏవోని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పి.పెంచలయ్య, ఎర్రంశెట్టి కృష్ణమోహన్, జి.మధుసూదన్‌రావు, పి.పెంచల నరసింహులు మాట్లాడారు. కావలి మున్సిపాల్టీ 3వ డివిజన్ ఇన్‌చార్జ్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న ఉమామహేష్ ప్రతి రోజు కార్మికులను పనులలో రకరకాలుగా వేధింపులకు గురిచేస్తున్నాడన్నారు. అన్యాయాన్ని ప్రశ్నించిన కార్మికులను పనులకు ఆపివేయడం, మాటలతో భయబ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. పారిశుధ్య కార్మికులపై ఆయన ఆగడాలు రోజురోజుకి మితి మీరిపోతున్నాయన్నారు. ఆయన ఆగడాల్ని ప్రశ్నిస్తే కార్మికులను ఇబ్బంది పెడుతున్నాడన్నారు. ఇదిలావుంటే 4వ డివిజన్‌లో నిన్న 30 మంది కార్మికులకు మస్టర్ వేయకుండా అక్కడ ఇన్స్‌పెక్టర్ నాగేశ్వరరావు ఇళ్ళకు పంపాడన్నారు. కార్మికులపై మున్సిపల్ అధికారుల వేధింపులు పెరిగాయన్నారు. అధికారుల పనితీరుపై తీవ్ర పోరాటం కొనసాగిస్తామన్నారు. పోరాటం ద్వారానే తగిన గుణపాఠం చెబుతామని వారు హెచ్చరికలు చేశారు.

## ప్రజల ముంగిటకే ఆరోగ్య సేవలు



**కోవూరు, అక్టోబర్20 ప్రభాతవార్త** : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు శ్రీకారం చుట్టారని కోవూరు ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలో గురువారం విలేజ్ హెల్త్ క్లినిక్‌కు శంకుస్థాపన కార్యక్రమాలను సాంప్రదాయబద్ధంగా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ లక్ష్మీకుమారి మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సహకారంతో 19.25 లక్షల వ్యయంతో ఈ హెల్త్ క్లినిక్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం తమకెంతో అదృష్టంగా ఉందన్నారు. ఈ హెల్త్ క్లినిక్‌లో ప్రజలకు కావాల్సిన అనేక రకాల వైద్యసేవలు ఉచితంగా అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీపీ టి. పార్వతి, ఎంపీడీవో శ్రీహరి, ఉప సర్పంచ్ మోషా, మహిళా విభాగం అధ్యక్షురాలు టి. జ్యోతి, పంచాయతీ కార్యదర్శి కరుణ కుమారి, గ్రామ రెవెన్యూ అధికారి జయరాజ్, వైసీపీ నేతలు నాగరాజు, శ్రీనివాసులురెడ్డి, సాయిరెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఓట్ల దరఖాస్తులు పరిశీలన



**కోవూరు, అక్టోబర్20 ప్రభాతవార్త** : కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు కోసం దరఖాస్తు చేసుకున్న ఫారాలను కోవూరు ఎంపీడీవో శ్రీహరి, ఎంఈవో రహీమ్ ఆధ్వర్యంలో నిశిత పరిశీలన చేపట్టారు. నవంబర్ 7వ తేది లోగా ఈ ఓటు కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరు తేది అని ఆ లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. పరిశీలన పూర్తిచేసిన దరఖాస్తులను తహాసీల్దార్ కార్యాలయంలో అందజేయడం జరుగుతుందన్నారు.

## పాల ఉత్పత్తిని పెంచేలా రైతులు దృష్టి పెట్టాలి



**కోవూరు, అక్టోబర్20 ప్రభాతవార్త** : గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు పాల ఉత్పత్తిని ఘననీయంగా పెంచేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ మాధవీలత అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాలలో గురువారం రైతులకు పశువుల దాణాను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం సీజన్ కానున్న దృష్ట్యా పశు సంరక్షణపై పాడి రైతులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఈ సీజన్‌లో వచ్చే వాధ్యలుపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని పశు వైద్యుల సలహాలు, సూచనలు తప్పక పాటించాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు పశువుల దాణను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వెటనరీ ఏవో సాజిద్, తదితరులు ఉన్నారు.

## ఆర్‌బికేలో పనిచేస్తున్న సిబ్బందిపై ఒత్తిడి తగ్గించాలి



**కోవూరు, అక్టోబర్20 ప్రభాతవార్త** :రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగులపై కొంతమంది అధికారులు వివిధ రకాల పనులు ఏకకాలంలో చేయాలని ఒత్తిడి చేయడం వలన మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నామని,కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులు గురువారం కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పని చేసేవారు వ్యవసాయ శాఖ రూపొందించిన వైఎస్సార్ యాప్‌లో తమ హాజరు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరలా వచ్చి సచివాలయ శాఖలో హాజరు వేయాలని చెప్పడం వలన తాము ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. అదేవిధంగా తాము వాడుతున్న సెల్‌ఫోన్‌లోనే వ్యవసాయ శాఖకు సంబంధించిన యాప్‌లను అప్‌లోడ్ చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పంట నమోదు , ఈ క్రాప్‌పై రైతులకు కూడా సరైన అవగాహన కల్పించేలా వ్యవసాయ శాఖ దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా దీనికి సంబంధించి భూమి రికార్డులను ఆర్‌బీకేలో పనిచేస్తున్న సిబ్బంది ఇస్తే ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా చేయగలమని ఈ సందర్భంగా వారు విన్నవించారు. వ్యవసాయ సహాయకులు ఇచ్చిన ఈ వినతిపత్రాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఏడీ సుజాత తెలిపారు.

## ఎన్‌ఎస్‌ఆర్ ట్రస్టు ద్వారా రూ. 60 వేలు ఆర్థికసాయం



**కోవూరు, అక్టోబర్20 ప్రభాతవార్త** : గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పాటూరు పంచాయతీలోని పలువురికి ఎన్‌ఎస్‌ఆర్ చారిటబుల్ తరఫున 60వేలు ఆర్థికసాయాన్ని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అందజేశారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న కె. హర్షకు 25 వేలు,కంటి ఆపరేషన్ కొరకుకె. పెంచలమ్మకు 20 వేలు, పాము కాటుకు గురైన జి.పద్మకు చికిత్స నిమిత్తం 10వేలు, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఎన్. సీనయ్యకు 5 వేలు మొత్తం 60 వేల రూపాయలను నల్లపరెడ్డి చారిటబుల్ ట్రస్టు తరపున అందజేశారు.

## వైసిపి సోషల్ మీడియా కన్వీనర్‌గా షేక్ రఫీ



**కోవూరు అక్టోబర్ 20 ప్రభాతవార్త** కోవూరు నియోజకవర్గంకి సంబంధించి వైసిపి సోషల్ మీడియా కన్వీనర్‌గా షేక్ రఫీ రెండోసారి నియమితులైయ్యారు. తనను సోషల్ మీడియా నియోజకవర్గం ఇన్‌చార్జిగా నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. తనపై ఉంచిన ఈ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ముందుకు సాగుతాననిని అన్నారు.

## ఒంటరితనాన్ని దూరం చేసేందుకే హమ్‌సఫర్



**నెల్లూరు టౌన్, అక్టోబరు 20, ప్రభాతవార్త:** ఒంటరితనం అనుభవిస్తున్న వృద్ధుల కొరకు హమ్‌సఫర్ (తోడు-నీడ) అనే కార్యక్రమాన్ని ప్యూర్ స్మైల్ చారిటీస్ ఆధ్వర్యంలో త్వరలోనే ప్రారంభిస్తున్నామని వ్యవస్థాపక నిర్వాహకురాలు షేక్ పర్వీన్ తెలిపారు. గురువారం ఆమె స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విధివశాత్తు భర్తలను పోగొట్టుకున్న మహిళలు, అలాగే భార్యలను పోగొట్టుకున్న పురుషుల కొరకు ఈ ప్రత్యేక కార్యక్రమం అని ఆమె స్పష్టం చేశారు. ఇది సేవలో ఒక భాగమేనన్నారు. ఉమ్మడి కుటుంబాలు ఇప్పటికే చాలా వరకు కనుమరుగయ్యాయని, ప్రస్తుతం అన్ని న్యూక్లియర్ కుటుంబాలు కనబడుతున్నాయని భార్య, భర్త, పిల్లలు అంతే వాళ్లకు వృద్ధులైన తల్లిదండ్రులను చూసే ఓపిక ఉండడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భార్య, భర్త ఇద్దరు ఉన్నప్పుడు పిల్లలకు దూరంగా ఉన్నా హాయిగా బతుకుతారని, కానీ విధివశాత్తు భార్యకు భర్త దూరమైనప్పుడు, భర్తకు భార్య దూరమైనప్పుడు వాళ్ల బతుకులు చెల్లాచెదురైపోతాయని పేర్కొన్నారు. స్వతంత్రంగా బతికి ఒంటరి అయినప్పుడు పిల్లల వద్దకు వెళ్లి వాళ్ల సూటిపోటి మాటలు పడలేక అనాథ ఆశ్రమాలకు వెళ్లలేక కొంతమంది ఒంటరిగానే పిల్లలకు దూరంగా ఉండి ఒంటరి బతుకులు బతుకుతూ పలకరించే దిక్కు లేక నా అనే వాళ్లు దగ్గర లేక నిరాశ నిస్సహాయంతో జీవితాలను గడుపుతున్న వృద్ధులను దృష్టిలో ఉంచుకుని వారు వృద్ధాప్యంలో కూడా ఒకరికి ఒకరు తోడు నీడగా ఉంటూ సుఖ సంతోషాలతో జీవించాలనే ఉద్ధేశంతో 50 సంవత్సరాలు దాటి ఒంటరిగా ఉన్న వృద్ధులకు స్వయంవరం లాంటి ఒక పరిచయ వేదిక ఏర్పాటు చేసి అందులో ఒకరికి ఒకరు నచ్చితే పిల్లల పర్మిషన్‌తో పెళ్లి చేసుకుంటారు లేకుంటే లివింగ్ రిలేషన్ అంటే ఇద్దరు ముగ్గురు కలిసి ఒకే ఇంట్లో ఒంటరిగా కాకుండా ఒకరికి ఒకరు తోడుగా స్నేహంగా సంతోషంగా ఉంటారు అనే ఉద్ధేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని వివరించారు. ఇది కూడా తాను వృద్ధులకు చేసే సేవలాగే భావించి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నానని స్పష్టం చేశారు. ఇక్కడ చేరేందుకు కుల మతాలకతీతంగా అన్ని వర్గాల వారు అర్హులేనని ఆమె ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. హమ్‌సఫర్ లో చేరే వారు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్‌కార్డు, భార్య/భర్త చనిపోయి ఉంటే డెత్ సర్టిఫికేట్ లేక విడాకులు తీసుకుని ఉంటే కోర్టు ద్వారా వచ్చిన విడాకుల పత్రాలు, ఇన్‌కం సర్టిఫికేట్, పిల్లల పర్మిషన్, 50 సంవత్సరాలు నిండిన వారు అర్హులని పేర్కొన్నారు. ఒకవేళ 50 సంవత్సరాలు దాటినా కూడా పెళ్లి చేసుకోకుండా ఉంటే వారికి ఇద్దరు సాక్షులు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ముందుగా పేరును రిజిస్టర్ చేయించుకుని పరిచయ వేదికలో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇందుకు ఎలాంటి రిజిస్టర్ ఫీజులు అవసరం లేదని, పరిచయ వేదికకు వచ్చినప్పుడు మాత్రం టీ,స్నాక్స్, భోజన ఖర్చులకు రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ పరిచయ వేదికలో పాల్గొనాలనుకున్న వారు 7671901065 నెంబరును సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని కోరారు.

## రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ వినతి



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 20 ప్రభాతవార్త** జిల్లాలో రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బిజెపి నేత-నమామిగంగే రాష్ట్ర ప్రముఖ్ మిడతల రమేష్ గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా గత వ్యవసాయ సీజన్‌లో ప్రభుత్వానికి ధాన్యం అమ్మిన రైతులకు అందుకు సంబంధించిన నగదు ఇంకనూ పూర్తిస్థాయిలో అందలేదని ఆ వినతిపత్రంలో పేర్కొన్న మిడతల రమేష్ తక్షణమే ఆ నగదు ఇప్పించాలన్నారు. అలాగే ధాన్యం బస్తాకు రూ. పదిరూపాయల చొప్పున హమాలీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఛార్జీలు ఇవ్వలేదన్న ఆయన ఆ ఛార్జీలు ఇప్పించాలని..ఇక రైతులకు రావాల్సిన రవాణాఛార్జీలు విడుదల చేయాలన్నారు. ఆయా నిదులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాల కోసం మళ్ళించుకుందన్న బిజెపి నేత తక్షణమే ఆయా నగదు హమాలీలు-రైతులకు అందజేయాలన్నారు. ఇక రూ.లక్ష రూపాయలలోపు వ్యవసాయ పరపతిరుణంపై సున్నా వడ్డీ అమలుచేయాల్సివుండగా రెండేళ్లుగా ఆ పథకం అమలుకావడం లేదన్న ఆయన ఇకనైనా ఆ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## చేనేత కార్మికులందరికీ చేనేతనేస్తం



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 20 ప్రభాతవార్త** జిల్లాలోని చేనేత కార్మికులందరికీ..ఉపవృత్తులవారికీ చేనేత నేస్తం వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ చేనేత జిల్లా ఐక్యవేదిక నాయకులు గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. చేనేత జిల్లా ఐక్యవేదిక నాయకులయిన బాలాజీ, ఆశం సురేష్, చింతగింజల సుబ్రమణ్యం, రామనాథం రాజశేఖర్, వేణుగోపాల్ తదితరులు ఈ సందర్భంగా జేసీతో మాట్లాడుతూ చేనేత కార్మికులకు చేనేతనేస్తం పథకం పేరుతో అందిస్తున్న ఆర్థికసాయాన్ని ప్రభుత్వం కుంటిసాకులతో తొలగిస్తోందని..తాజాగా జిల్లాలో 30 మంది చేనేత కార్మికులకు చేనేతనేస్తం ఆర్థికసాయం రద్దయిందన్నారు. ఈ నేపథ్యంలో చేనేత కార్మికులకు..ఉపవృత్తుల వారికి చేనేతనేస్తం అందించేలా చర్యలు తీసుకోవాలని జేసీని కోరినవారు అలాగేచేనేత సహకార సంఘాలను పున: ప్రారంభించాలని..చేనేత కార్మికులకు గుర్తింపుకార్డులు-ముద్రా రుణాలిప్పించాలని..చేనేత వస్త్రాలు సరళంగా అమ్ముకొనేందుకు ఆప్కో షాపులు పెట్టించాలన్నారు.

**నివర్‌తో నష్టపోయిన వారికి పరిహారం** ఇక జిల్లాలో నివర్ తుఫాన్ కారణంగా నష్టపోయిన చేనేత కార్మికులకు ప్రకటించిన పరిహారం అందజేయాలని చేనేత ఐక్యవేదిక ప్రతినిధులు ఈ సందర్భంగా జేసీని కోరారు. నివర్ తుఫాన్ కారణంగా నష్టపోయిన 10 మంది చేనేత కార్మికులకు రూ. 10 వేల చొప్పున, నూ లు దెబ్బతిన్న మరో 70 మంది చేనేత కార్మికులకు రూ. 5 వేలు చొప్పున చెల్లిస్తామన్న ప్రభుత్వం ఇం తవరకు ఆ పరిహారం ఇవ్వలేదన్న వారు ఇకనైనా ఆ మేరకు సాయం అందించాలన్నారు.

## నేటి నుంచి ఫ్యామిలీ ఫిజీషియన్

**బిట్రగుంట, అక్టోబరు 20 ప్రభాతవార్త** బోగోలు మండలం కోవూరుపల్లి పిహెచ్‌సి పరిధిలోని బోగోలు 2వ సచివాలయంలో ఈ నెల 21 నుంచి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వైద్యాధికారిణి డాక్టర్ సీమాతబాసు చెప్పారు. ఈ శిబిరంలో 14 రకాల వైద్య పరీక్షల్ని నిర్వహించి వ్యాధి నిర్ధారణ, ఉచితంగా మందులు పంపిణీచేస్తారని ఈకార్యక్రమం అన్ని సచివాలయాలలో కేటాయించబడిన తేదీలలో వైద్యులు అందుబాటులో వుంటారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## సబ్సిడి ద్వారా విత్తనాలు పంపిణి



**కలువాయి అక్టోబర్ 20 ప్రభాతవార్త** మండలకేంద్రమైన కలువాయిలో రబీసీజన్ మొదలు అయిన సందర్బంగా మండల వ్యవసాయాధికారి వి.ప్రతాప్ ఆద్వర్యంలో బుధవారం ఆర్‌బికె 1, పరిధిలో రైతులకు కలువాయి జడ్‌పిటిసి బులగాకుల అనీల్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా సబ్సిడితో ధాన్యం బస్తాలను పంపిణి చేశారు. ఈ సందర్బంగా ఏఒ ప్రతాప్ మాట్లాడుతు రైతు భరోసా కేంద్రంలో ప్రతి రైతు వేసే ప్రధాన పంట లైన వరి,శనగ విత్తనాలను సబ్సిడి పై సరఫరా చేసేందుకు సిద్దంగా ఉంచామని అన్నారు. విత్_నాలు కావల్సిన రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రంలో రైతుకు సంబంధించిన పొలం పాస్‌బుక్ జెరా క్స్,ఆధార్,పోన్‌నెంబర్‌తో గ్రామ వ్యవసాయ సహాయకులు దగ్గర రిజిష్టే షన్ చేసుకోవాలని వారు తెలి పారు.ఆర్‌బికె కలువాయి-3,ఏఏబి చైర్మన్ స్దానిక ప్రజా ప్రతినిధులు,గ్రామ వ్యవసాయ సిబ్బంది, వి .సాయి ప్రియాంక,జి మేఘన,ఎస్ శ్రీనివాసులు,అభ్యుదయరైతులు తదితరులు పాల్గోన్నారు.

## బుచ్చిలో పేకాట స్దావరంపై ఎస్ఇబి దాడి

### 20 మంది అరెస్టు-సుమారు 3 లక్షలు స్వాధీనం

**బుచ్చి అక్టోబర్ 20 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని కోనేటిమిట్ట శివాలయం పక్కనే వున్న అధికారపార్టీకి చెందిన నేత పాడుబడ్డ భవనంలో పేకాట స్దావరాలపై ఎస్ఇబి ప్రత్యేక బృందం అధికారులు దాడులు నిర్వహించారు.ఈ సంద్బంగా ఎస్ఇబి సిఐ సూర్యనారాయణ మాట్లాడుతు పేకాట స్దావరంపై నెల్లూరు ఎస్ఇబి ప్రత్యేక బృందం ,బుచ్చి సెబ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించడం జరిగిందని అన్నారు. 20 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అలాగే 2 లక్షలా 37 వేలా 460 రూపాయాలు నగదు, 19 సెల్‌పోన్లు,4 మోటార్‌బైకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.వీటిన్నంటిని తదుపరి చర్యలకోసం బుచ్చి సిఐ కోటేశ్వరరావుకు స్వాధీనం చేసినట్లు తెలిపారు.20 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కున్నారు.

## దివ్యాంగులకు మోటార్‌సైకిళ్ల పంపిణీలో ఆంక్షలు అన్యాయం



**కావలి రూరల్, అక్టోబరు 20 ప్రభాతవార్త** దివ్యాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న మోటార్‌సైకిళ్ళ పంపిణీలో ఆంక్షలు విధించడం అన్యాయమని తెలుగుదేశం పార్టీ విభిన్నప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి, జాతీయ వికలాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు తెలిపారు. మోటార్‌సైకిళ్ళ పంపిణీలో అలివికాని నిబంధనలు విధించి దివ్యాంగులకు మోటార్‌సైకిళ్లు అందని ద్రాక్షగా రాష్ట్ర ప్రభుత్వం చేసిందని విమర్శించారు. 10వ తరగతి పాసై వుండాలని, 45 సంవత్సరాల లోపు వుండాలని, 70 శాతం దివ్యాంగుడై వుండాలని, విద్యుత్ బిల్లు 300 రూపాయల లోపు వుండాలని, మాగాణి మూడు ఎకరాలు మించి వుండకూడదని, మెట్ట 10 ఎకరాలు మించి వుండకూడదని, ఉపాధి కొరకు ఎటువంటి కారు, తదితర వాహనాలు వుండరాదని ప్రభుత్వం ఆంక్షలు పెట్టిందని తెలిపారు. ఇటువంటి దిక్కుమాలిన ఆంక్షలు పెట్టి ఈ పథకం దివ్యాంగులకు ఉపయోగపడకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. దివ్యాంగులకు ఇచ్చే మోటార్‌సైకిళ్ళ పథకానికి ఎటువంటి నిబంధనలు పెట్టకుండా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

## సర్వేపల్లి సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా రమేష్ ఎంపిక



**మనుబోలు, అక్టోబరు 20 ప్రభాతవార్త** మనుబోలు మండలం సోషల్ మీడియా ఇన్‌చార్జ్ (వైఎస్‌ఆర్‌సిపి) గుంజి రమేష్‌కు ప్రమోషన్ లభించింది. ఆయనను సర్వేపల్లి సోషల్ మీడియా కోకన్వీనర్‌గా ఎంపిక చేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్వయంగా ప్రకటించారు. గుంజి రమేష్ వైకాపా పార్టీలో సోషల్ మీడియాలో చురుకుగా, వేగంగా పార్టీకి సమాచారం అందిస్తూ నియోజకవర్గంలో నమ్మిన బంటుగా పనిచేస్తున్నాడని మంత్రి తెలిపారు. ఇందుకోసం నియోజకవర్గ కోకన్వీనర్‌గా గుంజి రమేష్‌ను ప్రకటిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పవర్‌ప్లాంట్‌ను ప్రవేటీకరించరాదు



**ఆత్మకూరు, అక్టోబర్20, ప్రభాతవార్త:** నెల్లూరులోని కృష్ణపట్నం పోర్టు వద్ద ఉన్న దామోదర్ సంజీవయ్య విద్యుత్ పవర్‌ప్లాంట్‌ను ప్రవేటీకరణ నిర్ణయానికి నిరసనగా గురువారం ఆత్మకూరులో సిఐటియు, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పవర్‌ప్లాంట్‌ను ప్రవేటీకరించరాదంటూ నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ కార్మికుల భవిష్యత్తు దృష్ట్యా థర్మల్‌కేంద్రాన్ని ప్రవేటీకరణ కోసం చేపట్టిన టెండర్ల నిర్ణయాన్ని మానుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో సిఐటియు అనుబంధ కార్మికులు, సిపిఎం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డిని కలిసిన పుట్టా



**బుచ్చి అక్టోబర్ 20 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి దేవస్థానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డిని తిరుపతిలో కలిశారు. జొన్నవాడలో తిరుమల తిరుపతి దేవస్థానం వారు నేర్మించిన 2 అంతస్తుల భవనం శిదిలావస్తుకు చేరు కుందని ఆభవనాన్ని పునః నిర్మాణం చేయించమని కోరారు. ఈవిషయం వైవి సుబ్బారెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈకార్యక్రమంలో పాలక మండలి సభ్యులు టి సుప్రజ, ఆలయ అర్చకులు, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, తదితరులు పాల్గోన్నారు.

## సచివాలయం, ఆర్.బి.కెలను ప్రారంభించిన మంత్రి కాకాణి



**దగదర్తి, అక్టోబర్20, ప్రభాతవార్త:** దగదర్తి మండలం కాట్రాయపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్.బి.కె, హెల్త్ సెంటర్లను వ్యవసాయశాఖామంత్రి కాకాణి.గోవర్ధనరెడ్డి, కావలి ఎం.ఎల్.ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు గురువారం ప్రారంబించారు. ఈసందర్భంగా మంత్రి కాకాణి మాట్టాడుతూ ప్రజలకు పారదర్శకమైన పాలనను అందించాలన్న ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్తను సమర్ధవంతంగా నడిపిస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలను సకాలంలో మార్కెట్‌లకు చేరువయ్యేలా మద్దతుధర కల్పించే దిశగా లాబసాటి పంటలను వేసుకునేందుకు వీలుగా రైతు బరోసా కేంద్రాలను నడిపిస్తున్నామన్నారు. దాన్యం కొనుగోలుసైతం ఆర్.బి.కెల్ద్వారానే నడిపిస్తున్నామని గతంలో ధాన్యం కొనుగోలు విషయంలో కొన్ని లోపాలు జరిగాయని సదరు లోపాలపై విచారణలు జరుగు తున్నా యని భవిష్యత్తులో ఎలాంటిలోపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు రవాణా విషయంలో జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ కార్యాలయంలో జరిగిన అవినీతిపై రాష్ట్ర స్తాయి అధాకారులతో సమగ్ర విచారణ జరిపామని ఇప్పటికే కొందరిపై చర్యలు తీసుకున్నామని రైతులకు అన్యాయం జరిగితే ఒప్పుకునే ప్రసక్తేలేదని ఎంతటి వారైనా వదలబోమని అన్నారు. మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్యం చేరువయ్యేందుకు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటుచేసి వారంలో ఒకరోజు ఆగ్రామంలో వైద్యం అందుబాటులో వుంచుతున్నామని ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కావలి ఎం.ఎల్.ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయాలు ఆర్.బి.కెలు గ్రామీణ ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే సిబ్బంది అంకిత భావంతో పనిచేసి ప్రజలకు ప్రభుత్వ పదకాలు చేరువయ్యేలా తోడ్పా టును అందించాలని అన్నారు. ఈకార్యక్రమంలో వివిధశాఖల జిల్లా అదికారులు, కావలి ఆర్.డి.ఒ శీనానా యక్, కావలి రూరల్ సి.ఐరాజేష్, ఇన్‌చార్జ్ తహసిల్‌దార్, ఎం.పి.డి.ఒ, ఎస్.ఐ సుమన్, దగదర్తి ఎం.పి.పి ప్రసాద్‌నాయుడు, స్తానిక వై.సి.పి నాయకులు తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా దినేష్‌రెడ్డి జన్మదిన వేడుకలు



**కోవూరు, అక్టోబర్20 ప్రభాతవార్త :** కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తనయుడు, కోవూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నెల్లూరు రామ్మూర్తి నగర్ లోని ఆయన స్వగృహంలో గురువారం ఘనంగా జరిగాయి. కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండ లాలకు సంబంధించిన టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో వచ్చి శాలువా పూలమాలతో భారీ స్థాయిలో సత్కరించారు. అదేవిధంగా వివిధ మతాలకు చెందిన పురోహితులు దినేష్‌రెడ్డిని ప్రత్యేకంగా ఆశీర్వదించారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి పుట్టిన రోజు కావడంతో భారీ సంఖ్యలో నాయకులు కార్యకర్తలు హాజరయ్యి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. భారీ కేక్ కట్ చేసి సంతోషంగా ఈ వేడుకలను జరుపుకున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన పార్టీ సీనియర్ నేతలు ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ దేవాలయాలకు సంబంధించిన మాజీ చైర్మన్లు, పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## ఏపీజెన్‌కో ప్రైవేటీకరణ టెండర్ల రద్దుకై ధర్నా




**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 20 ప్రభాతవార్త** జిల్లాలోని ఏపిజెన్‌కో ప్రైవేటీకరణ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపిజెన్‌కో జేఏసీ-పరిరక్షణ కమిటీ ప్రతినిధులు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వ హించారు. ఏపిజెన్‌కో జేఏసీ-పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఎం.మోహన్‌రావు, గోగుల శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయకుమార్, సీపిఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్యలు ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ఏకైక ప్రభుత్వరంగ సంస్థ ఏపిజెన్ కోను రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం శోచనీయమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కేంద్రంలోని బిజె పితో కుమ్మక్కై ప్రైవేటీకరణ జపం చేస్తున్నారన్న వారు కేంద్రంలో బిజెపి-రాష్ట్రంలో వైసీపీ ప్రజల ఆస్తులను నిలువునా దోచుకుంటున్నాయన్నారు. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు రెండు ప్రభుత్వాలు ఊ డిగం చేస్తున్నాయన్న వారు స్థానిక ఎమ్మెల్యే. మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి ప్రజల ప్రయోజనాలను విస్మరించి ప్రైవేటీకరణ విధానాలను సమర్ధించడం దుర్మార్గమన్నారు. ఏపిజెన్‌కోను ఉద్దేశపూర్వకంగా నష్టాలలోకి నెట్టేసి స్వార్ధ ప్రయోజనాల కోసం ప్రైవేట్ సంస్ధలకు అప్పజెప్తున్నారని, ఏపిజెన్‌కోను ప్రైవేటీకరిస్తే కరెంట్‌ఛార్జీలు పెరుగుతాయని..నిర్వాసితుల సమస్యలు పట్టించుకొనే నాధులే వుండరని..అక్కడి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత వుండదన్నారు. ఈ నేపధ్యంలో ఏపిజెన్‌కో ప్రైవేటీకరణపై రాష్ట్ర క్యాబినెట్ చేసిన తీర్మాణాన్ని రద్దు చేయాలన్నారు. ఏపిజెన్‌కో మూడవ యూనిట్‌ను జాతికి అంకితం చేసేందుకు ఈనెల 27న ముఖ్యమంత్రి వస్తున్నారన్న ఏపిజెన్‌కో జేఏసీ-పరిరక్షణ కమిటీ ప్రతినిధులు మూడు యూనిట్లను కలిపి ఆదానీకి అంకితం చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారన్నారు. ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే ముఖ్యమంత్రి పర్యటనను అడ్డుకుంటామని..నిరసన తెలియజేస్తామన్న వారు ఉద్యోగులు..కార్మికులు..ప్రజలు కూడా ముక్త కంఠంతో ఏపిజెన్‌కో ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు. ఈ మేరకు నినాదాలు చేసిన ఏపిజెన్‌కో జేఏసీ-పరిరక్షణ కమిటీ ప్రతినిధులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్‌కు అందజేశారు.

## ఐఏబీకి హాజరుకావాలంటూ అంబటికి ఆహ్వానం



**నెల్లూరు కలెక్టరేట్, అక్టోబరు 20 ప్రభాతవార్త** జిల్లాలో మొదటిపంట (రబీ)కి సాగునీటిని కేటాయించే విషయమై ఈ నెల 23న జరుగనున్న జిల్లా సాగునీటి సలహామండలి సమావేశానికి (ఐఏబీ)కి హాజరుకావాలని రాష్ట్ర జల వనరుల శాఖామంత్రి అంబటి రాంబాబుకు జిల్లా జల వనరులశాఖ సూపరెండెంట్ ఇంజనీర్ కృష్ణమోహన్ ఆహ్వానం పలికారు. గురువారం విజయవాడలో మంత్రిని కలిసిన ఎస్ఈ జిల్లాలోని జలాశయాలో వున్న నీటిలభ్యత..పంటలకు విడుదల చేయాల్సిన నీటిపరిమాణంతదితరాలను వివరించి ఐఏబికి హాజరుకావాలని కోరారు.

## కార్తీక దీపోత్సవాన్ని జయప్రదం చేయండి



నెల్లూరురూరల్, అక్టోబరు20 ప్రభాతవార్త రూరల్ పరిధిలోని నెల్లూరు చెరువు స్వర్ణాల ఘాట్‌లో నవంబరు నెల ఏడవ తేదీన కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహిస్తోన్న మహాదీపో త్సవాన్ని జయప్రదం చేయాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధ ర్‌రెడ్డి భక్తులకు పిలుపునిచ్చారు. గురువారం దీపోత్సవ ఏర్పా ట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్తీక పౌర్ణమి సందర్భంగా గణేష్ ఘాట్‌లో విశేష పూజా కార్యక్రమాలుంటాయన్నారు. కార్తీక దీప విశిష్టత ప్రతిబింబించేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టామన్నారు. ఘాట్‌లో పార్ధివ శివలింగాన్ని ఏర్పాటు చేస్తారన్నారు. ఉదయం నుండి ఎవరికి వారు తమ గోత్రనామాలతో అభిషేకాలు, అష్టోత్రం జరుపుకునే అవకాశాన్ని కల్పించామన్నారు. 11 గంటల నుండి 28మంది రుత్వికులతో వివిధ హోమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు 1008మంది మహిళలతో కార్తీక దీపోత్సవం జరుగుతుందన్నారు. అనంతరం సాయంత్రం ఆరు గంటలకు హరిద్వార్, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల నుండి విచ్చేశే అర్చక స్వాములతో గంగాహారతి కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారన్నారు. వివిద జీవనదుల నుండి తీసుకువచ్చిన జలాలతో డ్రోన్‌ల సహాయంతో దీపోత్సవంలో పాల్గొన్న భక్తులకు సంప్రోక్షణ చేస్తారన్నారు. కార్తీక దీపోత్సవ సమితికి సంఘీభావం తెలిపారు. భక్తులు విరివిగా దీపోత్సవంలో పాల్గొని తీర్ధప్రసాదాలు స్వీకరించి జయప్రదం చేయాలని కోరారు.




## హరికుమార్‌పై దాడికి సోమిరెడ్డి వ్యూహం



**నెల్లూరురూరల్, అక్టోబరు20 ప్రభాతవార్త** రూరల్ నియోజకవర్గ వైకాపా నేత కుమార్‌హరికుమార్‌పై దాడికి మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరోసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వ్యూహం పన్నారని వైయస్సార్సీపి రాష్ట్రకార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నగరంలోని వైకాపా రూరల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రూరల్‌లో జరిగిన రెండు దురదృష్టకర సంఘటనలను స్థానిక శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమాన దృష్టితో చూస్తున్నా రన్నారు. నిష్పక్షపాత విచారణకు ఎమ్మెల్యే కోటంరెడ్డి ఆదేశించిన నేపధ్యంలో జిల్లా ఎస్పీని కలసిన అనంతరం టిడిపి నేతలు వ్యంగ్య వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ గురించి పదేపదే సోమిరెడ్డి ప్రస్తావించడం అనుమానాలకు తావి స్తోందన్నారు. నిందితుల సెల్‌ఫోన్‌లను వ్యూహాత్మకంగా బయ టకు పంపించి, ఆతర్వాత దాడి చేయించారా అన్న సందేహం కలుగుతోందన్నారు. వరుసగా అయిదు పరా య్యాలు సర్వే పల్లిలో ఓటమిని చవిచూడడంతో పాటూ కార్పోరేషన్ ఎన్నికల్లో పనికట్టుకుని ఇళ్ళిళ్ళూ తిరిగి మరీ స్వ గ్రామం అల్లీపురంలో కా ర్పోరేటర్‌ను గెలిపించుకోలేని వారు రాజకీయ పోరాటాల గురించి తమకు తెలియజేయాల్సిన అవసరం లేదన్నారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి గురించి సినిమా తీసుకుని కలెక్షన్ చేసుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. అయిదేళ్ళ వరుస ఓటమిల గురించి ఓ సినిమా తీస్తే బావుంటుందని ఎద్దేవా చేశారు. ఇష్టారా జ్యంగా మాట్లాడితే ప్రజా తిర స్కారానికి గురవ్వాల్సి వస్తుందని సూచించారు. టిడిపి సిటి ఇన్‌చార్జ్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి చరిత్రే ఒక దూప్‌షాట్ అని ఆరోపించారు. గత 30ఏళ్ళుగా ఆ యన ఏమిటన్నది అందరికీ తెలుసన్నారు. టిడిపి నేతలు వ్యంగ్య వ్యాఖ్యలను మానుకోవాలని హితవు పలికారు. 25వడివిజన్ కార్పోరేటర్ బద్దెపూడి నరసింహాగిరి, 24వడివిజన్ ఇన్‌చార్జ్ అరవ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## దినేష్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో కొడవలూరు మండల నాయకులు



కొడవలూరు అక్టోబర్ 20 ప్రభాతవార్త : భవిషత్తులో మరెన్నో పదవులు అధిరోహించాలని, మనసారా కోరుకుం టున్నాం అని కొడవలూరు మండల కన్వీనర్ కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి తెలిపారు , కార్యకర్తలు నెల్లూరు నగరంలో ఉన్న కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి స్వగృహం నందు తన యుడు పోలంరెడ్డి దినేష్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ వేడకలకు కొడవలూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గోన్నారు. ఈ సందర్భంగా పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి గజ మాలలతో, పూల బొకేలతో, శాలువాలతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసే కార్యక్రమంలో పాల్గో న్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, కరకటి మల్లికార్జున, చెక్కమధన్ మోహన్, గరి కపాటి రాజేంద్ర, కేతురెడ్డి వెంకటరమ ణారెడ్డి నాశంప్రసాద్, మాగుంట సతీష్‌రెడ్డి, కోదూరు బుజ్జిరెడ్డి, కోదూరు సుధాకర్‌రెడ్డి, చెముకుల వెంకయ్య, జోన్న శివకు మార్, సుమన్ తదితరులు పాల్గోన్నారు.







## రోగులకు అండగా ఆరోగ్యమిత్రలు



నెల్లూరు అక్టోబర్ 20, ప్రభాతవార్త- వైద్యం సొంత కుటుంబసభ్యులుగా భావించి రోగులకు అండగా ఉంటూ వారికి సేవలందించాలని ఆరోగ్యమిత్రలకు డీఎంహెచ్ఓ ఎం.పెంచలయ్య సూచించారు. గురువారం సాయంకాలం సంతపేటలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో ఆరోగ్యమిత్రలు, టీంలీడర్లు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ ఆరోగ్యమిత్రలు 24 గంటలు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో అందు బాటులో ఉండాలన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా చేస్తున్న వైద్యానికి ఎక్కడైనా అదనంగా డబ్బులు వసూలు చేస్తే అలాంటి ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆపరేషన్లు చేసుకున్న వారికి ఆరోగ్య ఆసరా డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో సకాలంలో జమ చేయాలన్నారు. నెల వారిరికార్డులు పక్కాగా ఉండాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ జిల్లాలో ఆరోగ్య ఆసుపత్రి పనితీరు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ కార్యాలయం సిబ్బంది చంద్ర, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**నెల్లూరురూరల్, అక్టోబరు20 ప్రభాతవార్త** రూరల్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలి పారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు రూరల్ పరిధిలో రెండవ విడత గడపగడపకూ - మనప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం 22వ డివి జన్ కెఎన్ఆర్‌స్కూల్ నుండి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ, రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే రాష్ట్ర ప్రభుత్వ ద్యేయమన్నారు. రూరల్ నియో జకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామి ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమపథ కాలను వివరించారు. స్థానిక సమస్యలు పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. కార్పోరేటర్ మూలే విజయభాస్కర్‌రెడ్డి తదితర అధికారులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకాలను బాధ్యతగా చేపట్టండి



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబరు 20, ప్రభాతవార్త:** నగరపాలకసంస్థలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబాలకు ఆర్ధిక చేయూత అందించే దిశగా కారుణ్య నియామకాలను బాధ్యతగా చేపట్టాలని కమిషనర్ డి.హరిత అధికారులను ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో గురువారం డిప్యూటి కమిషనర్, మేనేజర్, అన్ని విభాగాల సూపరింటెండెంట్‌లు, అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల్లో అర్హులైన వారికి ప్రమోషన్ అందించి ఉన్నత స్థాయి బాధ్యతలు కల్పించాలని తెలిపారు. కార్పొరేషన్‌లో అన్ని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలను అందించగలమని, ఆ దిశగా దస్త్రాలను వేగవంతంగా సంసిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మేనేజర్ ఇనాయతుల్లా, అన్ని విభాగాల సూపరింటెండెంట్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## వీధి శునకాల నియంత్రణకై ప్రత్యేక చర్యలు



**నెల్లూరు కార్పొరేషన్, అక్టోబరు 20, ప్రభాతవార్త:** నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజనుల్లో సమస్యాత్మకంగా మారిన వీధి శునకాల నియంత్రణకై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ డి.హరిత తెలిపారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం ప్రాంగణంలోని వీధి శునకాల జనన నియంత్రణ కేంద్రాన్ని కమిషనర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య కేంద్రంలో శునకాలకు జరుగుతున్న శస్త్ర చికిత్సలు, గాయాలకు తగిలిన మందులు, విశ్రాంతి ప్రదేశాలు, పౌష్టికాహారం అందించడం వంటి అంశాలను కమిషనర్ పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. శస్త్ర చికిత్సలు పూర్తయి మందులు, ఆహారంతో పూర్తిగా కోలుకున్నాక శునకాలను తిరిగి యధా స్థానాల్లో వదిలివేయాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న శస్త్ర చికిత్సలతో రానున్న రోజుల్లో శునకాల సంతానం పూర్తిగా నియంత్రణలోకి వస్తుందని, శునకాల బెడద సమస్యను అతి త్వరలో అధిగమించనున్నామని కమిషనర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ పశు వైద్యాధికారి డాక్టర్ మదన్‌మోహన్ పాల్గొన్నారు.